

34వ సెక్షన్ కేసు నమోదు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విధులకు ఆటంకం కలిగించి పోలీసులపై దౌర్జన్యకాండ చేసిన తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీమంత్రి అమర్నాథ్‌రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులివర్తి నానిలపై బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్‌లో పలమనేరు సిఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఏ వన్‌గా అమర్నాథరెడ్డి ఏ2గా పులివర్తి నాని, ఏ3గా నారా లోకేష్ ఉన్నారు. సమావేశంలో అనుమతి లేని వాహనాలను ఉపయోగించకూడదని, భారీ శబ్ధాలతో వినియోగించిన వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పోలీసులను తొక్కుకుంటూ పాదయాత్ర చేస్తామని, తమ పాదయాత్రకు ఎవరు అడ్డు రాకూడదని మాజీ మంత్రి అమర్నాథరెడ్డి అనడంతో కార్యకర్తలు రెచ్చిపోయారు. దీంతో నలుగురు పోలీసులకు, సీఐకి గాయాలయ్యాయి. పోలీసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ నరసింహారెడ్డి తెలిపారు.

సిపిఎస్ రద్దు చేయాల్సిందే..!

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి



సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ నేతల సంకల్ప దీక్ష


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, ప్రత్యామ్నాయంగా ప్రవేశపెడతామంటున్న జిపిఎస్‌ని ఒప్పుకొనే ప్రశ్నేలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల మూడో తేదీ విజయవాడ సమీపంలోని గన్నవరం ధర్మస్థలిలో చేపట్టిన సంకల్ప దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా ఆదివారం ఉదయం చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లాశాఖ ఆధ్వర్యంలో సంకల్ప దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చాడని, ఆ హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, గద్దెనెక్కాక ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించాడని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా సిపిఎస్ కొనసాగుతున్నదని అన్నారు. మాట తప్పను- మడమ తిప్పను అని పదేపదే ప్రకటించుకునే ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు విషయంలో మాట తప్పి, మడమ తిప్పాడని ఎద్దేవా చేశారు. సిపిఎస్ పట్ల ముఖ్యమంత్రికి అవగాహన లేకపోవడం వల్లే సిపిఎస్ రద్దుపై హామీ ఇచ్చాడని సలహాదారులు, ప్రభుత్వపెద్దలు ప్రకటనలు ఇవ్వడం దారుణమన్నారు. సిపిఎస్ బదులు గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) విధానాన్ని అమలు చేస్తామన్నడం విడ్డూరంగా ఉందన్నారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగ,ఉపాధ్యాయులను మరోసారి వంచించేందుకు ఈప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జీవి.రమణ మాట్లాడుతూ చతిస్గడ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తుంటే హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. సిపిఎస్ రద్దుపై ఇచ్చిన హామీని అమలు చేయమని శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే, ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఉద్యమాలన్నా, ఉపాధ్యాయులన్నా ఈ ప్రభుత్వం అతిగా భయపడుతోందని ఎద్దేవా చేశారు. సంకల్ప దీక్షను భగ్నం చేసి ఉపాధ్యాయులను నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడే ప్రశ్నే లేదని, ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎస్పీ బాషా, నాయకులు కత్తిశేఖర్, కష్ణమూర్తి, రెడ్డప్ప నాయుడు, దక్షిణామూర్తి ఎంవి.రమణ, పార్థసారథి, రేవతాపతి పిళ్ళై, చిట్టిబాబు, కో కన్వీనర్ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో యువగళం

- కార్పొరేషన్లను నిర్వీయం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుంది..
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం, పలమనేరు, పూతలపట్టు నియోజవర్గాల్లో పాదయాత్ర పూర్తి చేస్తున్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం చిత్తూరుకు చేరుకోనుంది. ఆదివారం తవణంపల్లి, ఐరాల, కాణిపాకంలో పాదయాత్ర సాగింది. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్న లోకేష్ సమీపంలోని ఓకళ్యాణ మండపంలో సిడిఎం సదస్సు నిర్వహించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా పూతలపట్టు నియోజవర్గ పరిధిలో పాదయాత్ర సాగే దారి వెంబండి భారీగా ఫ్లెక్సీలు, తోరణాలతో నింపేశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, యువనాయకులు వసంత్ కుమార్, పూతలపట్టు ఇన్‌చార్జి యువరాజులు నాయుడులు లోకేష్ బాబు వెంట నడిచారు. జగన్ ప్రభుత్వ తీరుపై విమర్శలు సంధిస్తూ పాదయాత్ర సాగింది. యువగళం పాదయాత్రలో పూతలపట్టు నియోకవర్గ యువత పెద్దసంఖ్యలో పాల్గొని లోకేష్ బాబు వెంట నడిచారు. తవణంపల్లి వద్ద గాండ్ల కులపెద్దలు నారా లోకేష్‌ను కలసి గాండ్లకార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. కాణిపాకం సమీపంలోని సిడిఎం కళ్యాణ మండపంలో నిర్వహించిన బీసీల సదస్సులో నారా లోకేష్ జగన్ ప్రభుత్వం బీసి అభివృద్ధిని విస్మరించిందని తెలుగుదేశం పార్టీ బీసిల అభివృద్ధికి పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి బీసిలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసినంత మాత్రన సరిపోదని నిధులు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బిసీ కార్పోరేషన్లకు నిధులు మంజురు చేయకుండా నిర్వీయం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీసీలంతా ఏకతాటిపై నిలబడి అరాచక సైకో ముఖ్యమంత్రికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాణిపాకం నుంచి సాయత్రానికి చిత్తూరు నగర శివార్లలోని పంట్రంపల్లి వద్దకు చేరుకున్న లోకేష్ రాత్రి అక్కడే బసచేయనున్నారు. సోమవారం ఉదయం చిత్తూరు నియోజకవర్గంలోకి పంట్రంపల్లి పల్లి నుంచి ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభకానుంది. చిత్తూరులో యువగళం పాదయాత్రను జయప్రదం చేసేందుకు తెలుగుదేశం నేతలు ఏర్పాట్లును పూర్తి చేశారు. గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. సంతపేట మీదుగా గాంధీ విగ్రహం తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయం మీదుగా ఆర్‌ఎల్ కళ్యాణ మండపం మీదుగా పాదయాత్ర సాగనుంది.


మహిళాకార్యకర్తల అభిమానం



సెల్ఫీ తీసుకుంటూ..



కాణిపాకంలో..



గడప గడపలో సమస్యల స్వాగతం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు ఆదివారం గుడిపాల మండలోని నంగనమంగలం, పెరుమాళ్‌కుప్పం కాలనీలో పర్యటించారు. డ్రైనేజ్, సిసిరోడ్డు, తాగునీరు, ఇంటిపట్టాలు ఎలక్ట్రికల్ పోల్స్, లైట్స్, కల్వర్టు లేవు అంటూ స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. ఈసమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, మంది కష్ణాపురం సర్పంచ్ వైలెట్, నంగమంగలం సర్పంచ్ జయకొడి, మండల కన్వీనర్ జనార్ధన్, వైస్ జడ్పీచైర్మన్ రమ్య, మేయర్ అముద,డెప్యూటీ మేయర్ చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ రామ గణేష్, ఏఎంసీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంపీటీసీ యోవన్, సర్పంచులు రజనీకాంత్, గుణవతి, మణి, ప్రసాద్ పాల్గొన్నారు.



సమస్యలను ఎంఎల్ఏ దృష్టికి తీసుకొస్తున్న వృద్ధురాలు

శ్రీసిటీలో జాతీయ సమైక్యతా మారథాన్

ప్రజాశక్తి - సత్యవేడు రూరల్:

యువతలో జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో ఆదివారం శ్రీసిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యతా మినీ మారథాన్ (5కె రన్) కోలాహలంగా సాగింది. ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ మారథాన్‌లో శ్రీసిటీలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, పరిశ్రమల ఉద్యోగులు 1000మందికి పైగా పాల్గొన్నారు. 5కె రన్‌లో పాల్గొనే వారందరూ క్రియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఉదయం 7 గంటలకు సమావేశమయ్యారు. వారిని నాలుగు వయో సమూహాలుగా విభజించి 30ఏళ్ల పైబడిన వారికి తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి జెండా ఊపి రన్ ప్రారంభించగా, ఐఐఐటీ- శ్రీసిటీ గవర్నర్ల బోర్డు చైర్మన్ ఎం.బాలసుబ్రహ్మణ్యం, క్రియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.కన్నబిరాన్ ఇతర వయో విభాగాల వారి రన్‌లను ప్రారంభించారు. 5కె రన్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా కొనసాగి ట్రిపుల్ ఐటీ క్యాంపస్ వద్ద ముగిసింది. జాతీయ సమైక్యత నినాదాలతో ఉత్సాహంగా సాగిన మారథాన్ ప్రజల దష్టిని విశేషంగా ఆకర్షించింది. పరుగులో పాల్గొన్న వారితో పాటు, వారిని ఉత్సాహపరిచేందుకు పెద్దసంఖ్యలో వాలంటీర్లు కూడా మార్గం పొడవునా బారులు తీరారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో మారథాన్ నిర్వాహకులను, పాల్గొన్న వారందరినీ అభినందించారు. ఈ తరహా కార్యక్రమాలు సమాజంలోని ప్రజల మధ్య విభేదాలను తగ్గించి, ఐక్యత, ఏకత్వ భావనను బలోపేతం చేసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. మారథాన్ అనంతరం జరిగిన సమావేశంలో నాలుగు వయో విభాగాల్లో ఒక్కో విభాగంలో మొదటి ముగ్గురు విజేతలకు ఎం.బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ నిర్మలరావు, ప్రొఫెసర్ జి.కన్నబిరాన్ బహుమతులు అందజేశారు. పాల్గొన్న వారందరికీ డిజిటల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్, శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఇంటర్వ్యూ

చేయూతను అందించడమే గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యం
జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేసి వారికి ఆర్థిక చేయూతను అందించడం జరుగుతోందని గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ తులసి తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందిచడంతో పాటు స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతోందని, స్వయం ఉపాధిని పెంచుకొనేలా వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడంతో పాటు చిరువ్యాపారంతో పాటు ఇతర వ్యాపారాలు నిర్వహించుకొనేలా ప్రోత్సహం అందిస్తున్నామని అన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అమలు చేస్తున్న అనేక పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల కంటే చిత్తూరు జిల్లా స్వయం సహాయ సంఘాల మహిళలు అన్నిరంగాల్లో ముందజలో ఉండటం గర్వకారణమన్నారు. జిల్లా సమాఖ్య ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ లోటుపాట్లను సవరించుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. అలాగే తమ సంస్థ ద్వారా నడుపుతున్న నవోదయం పత్రికకు మంచి ఆదరణ పొందుతోందని, రానున్న రోజుల్లో స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేయడంతో పాటు బ్యాంకుల నుండీ రుణాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గ్రామీణాభివృద్ధి సంస్థ అమలు చేస్తున్న వివిధ పథకాలను తెలియజేశారు.

ప్రజాశక్తి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్ని సంఘాలున్నాయి?

డిఆర్‌డిఎ పిడి: ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 60,440 సంఘాల్లో 5,57,958 మంది సభ్యులు ఉన్నారు.

ప్రజాశక్తి : ఫించన్ల పంపిణీ ఎలా ఉంది ఎంత మంది ఉన్నారు?



తులసి, గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి

డిఆర్‌డిఎ పిడి: జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుంది. వీలైనంత వరకు ఒకటో తారీకునే పింఛన్లు అందించేందుకు కృషి చేయడం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో వివిధరకాల ఫించన్లు 52,2,763 మంది పింఛన్ పొందుతున్నారు.

ప్రజాశక్తి: వైఎస్‌ఆర్ భీమా పథకం వర్తించేందుకు అర్హతలేమిటి...?

డిఆర్‌డిఎ పిడి: 18 సంవత్సరాల నుండీ 70 సంవత్సరాలు నిండిన వారికి జీవన్‌జ్యోతి భీమా పథకం కింద తెల్లరేషన్ కార్డు కలిగిన సంపాదకుడు, సంపాదకురాలికి మాత్రమే భీమా చేయడం జరుగుతోంది. భీమా సొమ్ము మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. సహజ మరణానికి లక్ష రూపాయలు, ప్రమాద మరణానికి ఐదు లక్షలు, పూర్తి అంగవైకల్యం ఏర్పడితే ఐదులక్షలు భీమా సొమ్ము అందిస్తున్నాం. కుటుంబ యజమాని మరణిస్తే తక్షణ సాయం కింద రూ.10వేలు అందిస్తున్నాం.

ప్రజాశక్తి: వైఎస్‌ఆర్ చేయూత పథకానికి ఎలాంటి అర్హతలు ఉండాలి...?

డిఆర్‌డిఎ పిడి: మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా ప్రభుత్వం వైఎస్‌ఆర్ చేయూత పథకాన్ని అమలు చేస్తోంది. 44 నుంచి 60 సంవత్సరాలు కలిగిన మహిళలు అర్హులు ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ మహిళలకు రూ.18,750లు ఏడాదికి అందిస్తోంది. గ్రామ సచివాలయల పరిధిలో ఈ పథకం అర్హులను గుర్తిస్తున్నారు. 2021లో మొదటి విడత 1,73,475 మంది లబ్ధిదార్లకు 325.27 కోట్లు, రెండో విడతలో 1,86,116 మంది లబ్ధిదార్లకు 348.97 కోట్లు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: జగన్న తోడు పథకం అమలు ఎలా ఉంది?

డిఆర్‌డిఎ పిడి: జగన్న తోడు పథకాన్ని రాష్ట్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చింది. ఈ పథకం ఉద్దేశం చిరువ్యాపారులను ఆదుకోవడం. ఫుట్‌పాత్‌లపై చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకొనే వారికి అర్థికంగా చేయూతను ఇచ్చి స్వతంగా వ్యాపారాలు నిర్వహించుకొనేలా ప్రోత్సహం అందించడం. వడ్డీ వ్యాపారులను వడ్డీలు తీసుకోకుండా ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి ఆకాభివృద్ధికి తోడ్పాటును అందించడమే పథకం ఉద్దేశం. ఎలాంటి ఆంక్షలు లేకుండా సున్నా వడ్డీతో రూ.10వేలు అందిస్తున్నాం. చిరువ్యాపారులకు బ్యాంకుల ద్వారా ఇప్పటి వరకు రూ.42.32 కోట్లు రుణసౌకర్యం కల్పించాం.

- తులసి, గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి

గ్రామీణ బ్యాంకులో ప్రయివేటు వాటా వద్దు..!



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామీణ బ్యాంకులు ప్రైవేటీకరణ, ప్రైవేట్ వాటాలు వద్దని గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సన్న, చిన్నకారు రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకొనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామీణ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం నిర్వీయం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. బ్యాంకు ఏర్పాటు ఉద్దేశం దెబ్బతినేలా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం మానుకోవాలని ఇందు కోసం ఇతర బ్యాంకు అసోషియేషన్లకు కలుపుకొని గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సంఘాలతో ఉద్యమాని పూనుకోనున్నట్లు చెప్పారు. మార్చి పార్లమెంట్ సమావేశాల్లో పార్లమెంట్ సభ్యులను కలిసి వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకుంటామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 40కోట్ల మంది ఖాతాదారులతో 35వేల మంది ఉద్యోగులు గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్నట్లు చెప్పారు. 18వేల మంది తాత్కాలిక ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం ఏండ్ల తరబడీ పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టడం లేదన్నారు. 45 సంవత్సరాల చరిత్ర కలిగిన బ్యాంకులను ప్రయివేటుపరం చేయడం, వాటాలను విక్రయించడాన్ని అన్ని యూనియన్లు ఏకతాటిపై వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆనందరెడ్డి, గ్రామీణ బ్యాంకు అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరావు నాయకులు ప్రతాప్, సుబ్రమణ్యం, శ్రీనివాసరెడ్డి, హరిశశి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణంలో మండలంలో నూతనంగా ఎంపికైన గహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గహ సారథులు భవిష్యత్తులో క్రియాశీలక పాత్ర పోషించాలని.. ప్రతి గడపకు ప్రభుత్వం అందించిన పథకాలతో లబ్ధి చేకూర్చిన విషయం ప్రతి కుటుంబానికి తెలియజేసి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలుకు కషి చేసిన విధానాన్ని తెలియజేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు లబ్ధి చేకూరిందని, ఈ విషయాన్ని ప్రతి కుటుంబానికి తెలియజేసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచిందని, ప్రతి కుటుంబానికి తెలియజేసిన బాధ్యత వాలంటీర్లు, గహ సారధులదే అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర అభివద్ధికి ప్రజా సంక్షేమ పథకాల అమలకు సహకారం అందించే విధంగా వారికి తెలియజేయాలని అన్నారు. ఇకపై మండలంలో గహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని.. అర్హత కలిగి ఏదైనా పథకం అందని అర్హులు ఉంటే వారిని గుర్తించి, అర్హతకు తగిన పథకం అందేలా కషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుష్మ కీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీ.డి బాబు, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, తమ్మి రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు పథ్వినాథ్, సర్పంచులు రవికుమార్, మాదనపల్లి రమేష్, జాఫర్, రమేష్, చంద్రమోహన్, భాస్కర్, చంద్రశేఖర్, ఎంపీటీసీలు గురుమూర్తి, మోహన్ రెడ్డి, నాయకులు అమర్నాథ్ రెడ్డి, సురేష్, మార్కెటింగ్ డైరెక్టర్లు శ్రీనివాసులు, సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



ఆసుపత్రిలోని రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

ప్రజాశక్తి- పలమనేరు

పట్టణంలోనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్యంతో పాటు సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దష్టికి తీసుకురావాలని రోగులను ప్రజలను కోరారు. ఆయన వెంట ఏరియా ఆసుపత్రి అభివద్ధి ఛైర్మన్ చెంగారెడ్డి వైస్‌ఛైర్మన్ ముజ్జు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం ఉదయం 10.30గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలని అన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572- 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

8న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: నారాయణ హదయాలయ వారిచే మండల కేంద్రంలోని రాయల్ మహల్ మెయిన్ రోడ్ బైడపల్లిలో ఈనెల 8న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ సిటిజన్లను ఆధివారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈవీ గురురాజారావు మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 5న విశాంత్రి ఉద్యోగుల్లో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఎలాంటి పనిఒత్తిడి లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెన్షన్ దారులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అరుణాచలంరెడ్డి, సుకుమార్‌రాజు వారి ఆధ్వర్యంలో డాక్టర్ మధుసూదనరాజు, మల్లికామేశ్వరి, శ్రీధర్‌వర్మ, మురహరి, ప్రభావతమ్మ, సంపత్, గంగిరెడ్డిలను శాలువలు కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపురం పింఛను తిరుపతిలో పంపిణీ



ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఎల్‌ఆర్ పేట పంచాయతీ వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన నాగభూషణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని టాటా ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే వైఎస్సార్ పింఛన్ పంపిణీలో భాగంగా వలంటీర్ సుధా ఆధివారం తన సొంత ఖర్చులతో తిరుపతికి వెళ్లి పింఛన్ అందించారు. దీంతో నాగభూషణమ్మ ఆనందతో కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సత్యనారాయణ పూజ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాఘమాసం పురస్కరించుకొని మండలంలోని జంబువారిపల్లి పంచాయతీ మాధవనగర్‌లో ఆదివారం సంవత్సరంలో వచ్చే మాఘ మాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని సత్యనారాయణ స్వామి పూజ బ్రహ్మానంద ఆశ్రమం నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో జరిగింది. అన్నదానం చేపట్టారు. ఆశ్రమ సహాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, నరసింహులు నాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: పాడి పశువులకు వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి భాను ప్రసాద్ తెలిపారు. , ఆదివారం శ్రీ కావేరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో శ్రీజ డెయిరీ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏసీవో మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సీజన్లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గతంలో కురిసిన వర్షాలకు పాడిపశువులు గాలికుంటు వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పక వేయాలని తెలిపారు. టీకాలు వేయడంతో పాలు తగ్గిపోతుందని కొందరు టీకాలు వేయించుకోవడం లేదని.. టీకాలు వేయించడం ద్వారా పాల దిగుబడి తగ్గదని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మారి, రీగన్, చంద్రబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

చిన్నపొట్టుచేనులో పశువుల పండుగ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: చిన్నపొట్టుచేను గ్రామంలో ఆదివారం పశువులు పండుగ జరిగింది. పశువుల పండుగకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అల్లివైపు పరుగులు తీసే ఎద్దులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. వీటిని నిలువరించే టందుకు యువకులు పోటీపడ్డారు. ఈ ఎడ్ల పందాలలో ఎద్దులదే పైచేయిగా నిలిచింది. గ్రామ పెద్దలు నిర్దేశించిన వీధి అల్లీలో ఎద్దులను వాటి యజమానులు కొమ్ములకు పట్టీలు కట్టి అల్లీవైపు వదిలారు. ఈ బహుమతులను చేజిక్కించుకునే ప్రయత్నంలో యువకులకు గాయాలయ్యాయి. ఈ వేడుకలను తిలకించడానికి చుట్టుపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రికి సమస్యలపై వినతి



ప్రజాశక్తి-సోమల: సమగ్ర శిక్ష మెసెంజర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తిరుపతిలో పద్మావతి గెస్ట్ హౌస్‌లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. స్టేట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రవి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో మండల విద్యా కేంద్రంలో మెసెంజర్ పోస్ట్ కింద తమను విధుల్లోకి తీసుకున్నారని.. కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పెర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని, పంచాయతీరాజ్ వ్యవస్థలోకి తమను తీసుకొని సచివాలయాల్లో అటెండర్ పోస్టులుగా నియమించాలని, మెసెంజర్ మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించి ఎస్‌పీడీ వారికి తెలియజేసి సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, చిత్తూరు జిల్లా యూనియన్ సెక్రటరీ సోమల నారాయణ, పుత్తూరు నారాయణవనం తదితర ప్రాంతాల నుండి వచ్చిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గూడూరు మండలాభివృద్ధి



ప్రజాశక్తి-గూడూరు: సమిష్టి కృషితో గూడూరు మండలాభివృద్ధి సాధ్యమని.. ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీపీ బూదూరు గురవయ్య అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గూడూరు మండలంలోని 19 పంచాయతీలలో అభివద్ధి పనులను గుర్తించి 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పేద ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించుకోవడం జరుగుతుందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ ఓడూరు యమనమ్మ మాట్లాడుతూ ఏఎంసీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. త్వరలోనే ప్రభుత్వ పెద్దలతో వాటిని ప్రారంభిస్తామన్నారు. తహశీల్దారు బాలలీలారాణి మాట్లాడుతూ గూడూరు మండలంలో ఎక్కడైనా సాదా బైనామా, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే వారికే ఆ భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గూడూరు మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.1.20 కోట్లు మంజూరైందని.. జీఎస్టీ ప్రధాన కారణంగా ఎవరూ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. మార్చిలోపు ఈ పనులను ప్రారంభించకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. గూడూరు మండలం మొత్తం 350 ఇళ్లు మంజూరయ్యాయని.. 268 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని.. మిగిలిన ఇళ్లు త్వరలోనే ప్రారంభించాలన్నారు. రెండో విడత ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసుకుని త్వరగా కట్టుకోవాన్నారు. ఇప్పటివరకు గూడూరు మండలంలో 1168 పట్టాలు ఇచ్చారని.. మొదటి విడత 367 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మానం ఇంద్రాణి, ఎంపీటీసీలు గడ్డం సహదేవ్, నాగమణి, సర్పంచులు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి అంతిమయాత్ర ఆరంభం

టీడీపీ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ప్రజాశక్తి -గూడూరు: నారా లోకేష్ పాదయాత్రతో జగన్ ప్రభుత్వానికి అంతిమయాత్ర ఆరంభమైందని గూడూరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పంచాయతీ నిధులను స్వాహా చేసి పంచాయతీ సర్పంచులకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. అప్పుల పాలన చేస్తూ.. ప్రజలపై పన్నుల భారం మోపుతోందని, టీడీపీ అధికారంలోకి వస్తే సుపరిపాలనందిస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రంలో జరుగుతున్న అకత్యాలను ప్రజలకు పాదయాత్ర ద్వారా తెలియజేయాలని యాత్రకు తరలివస్తున్న విశేష జనసంద్రాన్ని చూసి వైసిపి నాయకులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు ఖాకీ దుస్తులు వదిలి ఖైదీ దుస్తులు ధరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఆ భయంతోనే పోలీసు ఉన్నతాధికారులను తమ చెప్పుచేతలలో పెట్టుకుని పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సష్టిస్తున్నారని 100 కిలోమీటర్ల పాదయాత్రకే తల్లడిల్లిపోతున్న వైసిపి నాయకులు పాదయాత్రలో అడుగడుగునా అడ్డంకులు సష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని అనుమతులు ఉన్నా సరే మూడు వాహనాలను సీజ్ చేశారని.. బహిరంగ సభను జరుపకుండా ఆపివేశారన్నారు. పాదయాత్రను పోలీసులు అడ్డుకుని ఇబ్బందులు కలిస్తున్నారని.. కార్యకర్తలపై దాడులు చేసి హత్యాయత్న కేసులు పెట్టడం వైసీపీ చేష్టలకు నిదర్శనమన్నారు. నిబంధనలు ఉల్లంఘించారంటూ యువకులతో పాటు నేతలపై ఐపీసీ సెక్షన్స్ కింద కేసులు నమోదు చేయడం అవమానుషమన్నారు. అడ్డంకులు సష్టించి అడ్డుకోవడం పోలీసులు దాడి చేస్తూ తమ విధులకు భంగం కలిగించారంటూ టి.డి.పి నేతల పైనే కేసులు నమోదు చేస్తున్నారంటే పోలీస్ వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. లోకేష్ పాదయాత్రలో ప్రచార రథాలు ఎక్కొద్దు.. మైకులు వాడొద్దు అనడం దారుణమని.. జగన్మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్రలో ప్రచార రథాలు ఎక్కకుండా చెట్లపైన ఎక్కి ప్రచారాలు చేశారా అని ప్రశ్నించారు. పాదయాత్రలో మైక్ వాడవద్దని, ప్రచార రథాలు ఎక్కవద్దనటం సిగ్గుచేటన్నారు. గతంలో జగన్మో హన్‌రెడ్డి పాదయాత్ర చేసినపుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఆయనకు ఎలాంటి అడ్డంకులు పెట్టలేదని.. పోలీసుల సహకారంతో ప్రశాంతంగా జరుపుకోమని విశేషమైన వాతావరణాన్ని కలిగించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అలాంటి దానిని మరిచి టీడీపీ శాంతియుతంగా పాదయాత్ర చేస్తుంటే గిట్టని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో దాడి చేయించడం రాక్షసత్వమని పేర్కొన్నారు. 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గూడూరు నియోజకవర్గం ఇంటింటికీ సునీల్ కుమార్ కార్యక్రమంలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలు.. ప్రజా సేవాలయాలు..!





ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సచివాలయాలు.. ప్రజా సేవాలయాలని.. ప్రజా సమస్యలకు సచివాలయాలతో అక్కడికక్కడే పరిష్కారం దొరుకుతోందని. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంగళం పరిధిలోని రణధరపురం గ్రామ పంచాయతీ, మంగళం గ్రామపంచాయతీలలో సుమారు రూ.80 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఆయనతోపాటు తిరుపతి రూరల్ మండలాధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సాంప్రదాయ కళల క్రియేటివిటీ అకాడమీ డైరెక్టర్ చిలమంద మునికష్ణయ్య, సర్పంచ్ గంగారపు వరలక్ష్మి రాంబాబు, పంచాయతీ ఇన్‌ఛార్జి చిలమంద హరికష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సచివాలయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. పౌర సేవలను గ్రామపంచాయతీ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అలానే రణధీరపురం పంచాయతీలో పంచాయతీ ఇన్‌ఛార్జి పీఎం లక్ష్మీనారాయణ, సర్పంచి లీలావతి, ఉపసర్పంచి మల్లెమొగ్గల ఉమాపతి, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి, ఉపసర్పంచ్ వసంత అశోక్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభం స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రళయకావేరి నారాయణరెడ్డి, తిరుమలనగర్ పంచాయతీ ఇన్‌ఛార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, మంగళం పంచాయతీ ఉపసర్పంచి బైరెడ్డి రమేష్, ఎంపీటీసీ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేష్, పంచాయతీరాజ్ విభాగం డీఈ ప్రభాకర్ రెడ్డి, ఏఈ రాజమస్తానయ్య, తిరుపతి రూరల్ ఎంపీడీవో వెంకటనారాయణ, ఏపీఎం గురునాథరెడ్డి, తిరుమల నగర్ పంచాయతీ ఉపసర్పంచి తిరుమల ప్రసాద్ బాబు, వార్డు మెంబర్లు, చిట్టి, రమేష్, దయాకర్, కయ్యాల భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభం



ప్రజాశక్తి-సోమల: సదుం మండలం కంభంవారిపల్లి పంచాయతీ బల్లావారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో నీటి సరఫరాను ఆదివారం ఎంపీపీ మల్లప్ప ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం నూతన బోరు బావుల తవ్వకాలు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్, నియోజకవర్గ టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు నియాజ్ అలీ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 9న మండలంలోని దేవాలయం మిట్ట, కడప గుంట తిరువీదికుప్పం ,మహాదేవ మంగళం, ఆరిమాకులపల్లి , ఆవల కొండ, తూగుండ్రం హై స్కూల్ క్రాస్, బాలయ్య కొత్తూరు, పిల్లారకుప్పం తాటిమాకులకండిగ మీదుగా సాగే పాదయాత్రను యువత ఆయా జంక్షన్ లో భారీగా తరలి వచ్చి విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఇప్పటికే సుమారు 120 కిలోమీటర్లు చేసిన పాదయాత్రలో నారా లోకేష్ కు పజలు ఘన స్వాగతం పలికి పాదయాత్రలో భాగస్వాములై ఆయన వెంట నడిచారన్నారు.

ఆకుల బాబా అభిలాష్‌కు ఎన్‌టీఆర్ కళారత్న అవార్డు



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని అన్నదాన ధర్మకర్త, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ తనయుడు ఆకుల బాబా అభిలాష్ కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ నటుడు, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా శ్రీ రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ప్రముఖ కళా వేదిక శ్రీ త్యాగరాయ గానసభ లో ఎన్‌టిఆర్ కళారత్న అవార్డును ప్రముఖ సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. అభిలాష్ తల్లి ఆకుల హేమలత పేరుపై ఏర్పాటు చేసిన ఆకుల హేమలత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన పలు సేవా కార్యక్రమాలం గుర్తించి షార్ట్ ఫిల్మ్ లో తనదైన శైలిలో ఆకట్టుకోవడం తో అభిలాష్ అవార్డ్ కు ఎంపికైనట్లు శ్రీరామరాజు ట్రస్ట్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నేర్పిన సేవా దృక్పథానికి ఈ అవార్డు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

మానవ హక్కులు మహిళా అధ్యక్షురాలిగా రాజేశ్వరి

ప్రజాశక్తి-పలమనేరు: జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ పలమనేరు నియోజకవర్గం మహిళ అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన రాజేశ్వరిని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డివి మునిరత్నం, వేలాయుధం తెలిపారు. అందులో భాగంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో భూదేవి అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి ప్రసాద్ ఆదేశాల మేరకు మహిళా సమస్యలపై పనిచేయడానికి రాజేశ్వరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. జాతీయ మానవ హక్కుల సంస్థ పలమనేరు పట్టణంలో ఏర్పాటు చేసి జిల్లా నలుమూలల వ్యాప్తి చెంది ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పనితీరును గమనించిన రాజేశ్వరి ఆకర్షితురాలై స్వచ్ఛందంగా తన వంతు ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన ఆమెకు నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలిపారు. అధ్యక్షురాలుగా రాజేశ్వరి, కార్యదర్శులుగా భూదేవి, రెడ్డెమ్మ, కోశాధికారిగా కాంతమ్మ, ఉపాధ్యక్షురాలు, హేమావతి, సహాయ కార్యదర్శిగా కవిత, సభ్యులుగా శ్రీదేవి, శాంతమ్మ, జయమ్మ, నిర్మల, సుబ్బమ్మలను ఎంపిక చేశారు. రాజేశ్వరి మాట్లాడుతూ తనను గుర్తించి అధ్యక్షురాలుగా బాధ్యత ఇచ్చినందుకు నిజాయితీగా మహిళలకు అన్యాయం జరిగితే బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని తెలిపారు.

మసమ్మ జాతరలో మంత్రి పెద్దిరెడ్డి



ప్రజాశక్తి-పుంగనూరు: మసమ్మ జాతరలో రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కురపల్లి గ్రామంలో జరిగిన మసమ్మ జాతరలో ఆదివారం మంత్రి పాల్గొని పూజలు చేశారు. ఆంధ్ర కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న కురపల్లి గ్రామంలో మైసమ్మ జాతర వైభవంగా ప్రతి ఏడాది నిర్వహిస్తారు. రెండు రాష్ట్రాల నుండి భక్తులు వేలాది మంది పాల్గొంటారు. ప్రతి ఏడాది మైసమ్మ జాతరలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే పుంగనూరు పట్టణంలో జెట్టి కుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చాముండేశ్వరి దేవి ఆలయ జీర్ణోద్ధరణ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి , సర్పంచ్ శంకరప్ప, కౌన్సిలర్ మనోహర్, త్యాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆవులు అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన నాయకుడికి పరామర్శ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన సింగిల్ విండో డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానిక నాయకుల సమాచారంతో పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డిని ఎమ్మెల్యే వెంకటేగౌడ పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యులను ఆదేశించారు. మండల కన్వీనర్ బాగారెడ్డి వైఎస్ ఎంపిపి జీ.డి బాబు పరామర్శించారు.

గరుడ వాహనంపై నారాయణుడు



ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: వేపంజేరి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నారాయణుడు గరుడ వాహనంపై అధిరోహించగా పలువురు భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో లక్ష్మీనారాయణులకు అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కళ్యాణోత్సవం పూజలు నిర్వహించారు .సాయంత్రం గరుడ వాహనంపై నారాయణుడు భక్తులకు దర్శనభాగం కలిగించారు. వివిధ ప్రాంతాల నుండి పలువురు భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశులు రెడ్డి , పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైతులు పంటలకు ఈకేవైసీ చేయించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: రైతులు పంటలకు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని నగరి ఆర్డీవో సజన తెలిపారు. ఆదివారం తహశీల్దారు బాబు, ఏవో ఢిల్లీ ప్రసాద్, సిబ్బందితో కలిసి పంట నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాలసముద్రం, ఏటుకూరిపల్లె పంచాయతీలో ఈ క్రాప్ బుకింగ్‌ని రైతులు సాగుచేసిన భూమి వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ బాబు, తంగరాజ్, వ్యవసాయ సహాయకులు వనజ, వీఆర్ఏ మునస్వామి పాల్గొన్నారు.

విద్యాసామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరంలోని అన్నారావు సర్కిల్ వద్దగల యానాది కాలనీలో పరివర్తన సేవాసంస్థ, శ్రీభారతి సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 50మంది బాలబాలికలకు విద్యా సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని పరివర్తన సేవాసంస్థ నిర్వాహకులు పల్లం అమరనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీభారతి సోషల్ సర్వీస్‌సొసైటీ అధ్యక్షురాలు ఆర్.భారతి మాట్లాడుతూ తిరుపతి మురికివాడలోని బాలబాలికల విద్యాసాధికారత కోసం తమ సంస్థ ద్వారా ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న పేదవిద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్, పెన్నులు, జామెంట్రీ బాక్సు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీభారతి వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్.రాజు, పరివర్తన సేవాసంస్థ కార్యకర్తలు వెంకటేశు, రమేషు, కాలనీ అభివద్ధి సంఘం సభ్యులు శ్రీనివాసులు, అంకమ్మ మారమ్మ, వెంకటేశు తిరుమలేశు విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజ భవన్‌కు భూమన భరోసా



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బలిజ జెఏసి అధ్యక్షులు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్‌ల ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిసి బలిజభవన్ ఆక్రమణలకు గురికాకుండా చూడాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నీలం బాలాజీ మాట్లాడుతూ బలిజ భవన్ అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ బలిజ భవన్ తిరుపతి బలిజల ఆకాంక్ష అని దాని కబ్జాలకు గురికాకుండా రక్షణ కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బలిజభవన్ సంరక్షణ బాధ్యత తమపై ఉందని మరియు వెంటనే ఎమ్మారోఓకు చెప్పి స్థలాన్ని శుభ్రపరచి బలిజ భవన్ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అఖిల భారత గాజుల బలిజ సంఘం అధ్యక్షులు ఆళ్వారు మురళి, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కరుణానిధి, రవీంద్ర, విజయలక్ష్మి, శంకరప్ప, వనబోలు మధు, చెంచుకష్ణ, సుబ్రహ్మణ్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజుకు మాతృ వియోగం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్‌డి) ఎస్‌వీఎస్ సుబ్బరాజు తల్లి ఎన్.వాసుదేవమ్మ (85) ఆదివారం మృతి చెందారు. ఆమె మతి పట్ల ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. కాగా, నెల్లూరు పట్టణంలో సోమవారం ఆమె అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ గౌరవాధ్యక్షులుగా ఆనందబాబు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు నియోజకవర్గ సమావేశం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి ప్రభుత్వ దృష్టికి రాష్ట్ర సంఘం ద్వారా తీసుకెళ్లి పరిష్కారమయ్యేట్లు చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు తాలూక ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఆనందబాబు ను ఫెడరేషన్ పలమనేరు నియోజక వర్గ గౌరవాధ్యక్షులు గా ఎన్నుకొని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కాలామానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, నియోజకవర్గం లోని అన్ని మండలాల ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.